

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 43 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'అయ్యా! ఒక్క చిత్తం చేసుకొనుడు గావాల! ఆడ పోరి అయ్యిందా యింగ నా కాల్లు రెక్కలు సల్లవడుడే' నిష్కర్షగా కొడుకును మానసికంగా సిద్ధం చేస్తున్నది మల్లమాంబ. బోనులోపడ్డ జంతువులా ఆందోళనగా పచార్లుచేస్తున్నాడు సుదర్శనాచార్యులు. వసారాలో స్తంభానికి చేరగిలబడి మధ్య మధ్య యింటి లోపలికి పరిశీలనగా చూస్తూ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వెల్లడిస్తున్నది.

'నీల్లు పోయినంక రాల్లు ఏసుడు ఒద్దు' నెమ్మదిగా పట్టి పట్టి ఒక్కొక మాటే ఒత్తి ఒత్తి పలుకుతుంటే అంతకంతకూ నాగస్వరానికి లొంగిపోతున్న నల్ల త్రాచులా పచార్ల మధ్య మధ్య తలాడిస్తున్నాడు సుదర్శనాచార్యులు. 'ఉంనొక్క ఎకరం చెలక జూస్కోవాలె! గుళ్ళ యింత దీపం బెట్టాలె .. వంశం నిలబెట్టాలె.. మొగపోరడైతే చేస్తడు' ఎర్రగా కాలిన యినుము మీద నెమ్మదిగా ఒక్కొక్క దెబ్బ వేస్తున్నట్లు కొనసాగిస్తున్నది మల్లమాంబ. వసారా దాటి, ఆ వెనకున్న విశాలమైన గదిని దాటి, ఆ వెనకున్న పడమటి గదిలోనుండి మూలుగులు, బాధతో చేస్తున్న ధ్వనులు వుండీ వుండీ వినిపిస్తున్నాయి. కొద్దిగా మొరటుగా, గద్దిస్తున్నట్లుగా, సముదాయిస్తున్నట్లుగా మరొక గొంతు వినిపిస్తున్నది.

సంతూరులో ఉన్న నరసింహస్వామి ఆలయ అర్చకుడు సుదర్శనాచార్యులు. తండ్రి శఠగోపాచార్యులు గతించినతర్వాత ఆలయబాధ్యతలు కుటుంబ బాధ్యతలు అతడి నెత్తినపడ్డాయి. ఆలంపూరు జోగులాంబ అర్చకుల పిల్ల జోగులాంబను కోడలిగా తెచ్చుకున్నాడు శఠగోపాచార్యులు. కోడలు యింట్లో కాలు బెట్టిన సంవత్సరం తిరక్కముందే కాలంచేశాడు. కోడలు జెట్టక్క(జ్యేష్ఠా దేవి) నెత్తిమీద కూసొనుడే శఠగోపాచార్యులు అకస్మాత్తుగా కాలంచెయ్యడానికి కారణం అని తీర్మానించింది మల్లమాంబ.

పాలమూరు పరగణాలోనే పేరుమోసిన జ్యోతిషవేత్త, మంత్రవేత్త, నృసింహ ఉపాసకుడు శఠగోపాచార్యులు. లోకోద్ధారకుడైన మనుమడు నా వంశాన్ని నిలబెడతాడు అని చెప్పేవాడు తన కొడుకుతో, భార్యతో. జోగులాంబ నవమాసాలు నిండి పురుటినొప్పులు పడుతున్నదిప్పుడు.

పెనిమిటి అకాలంగా మరణించాడు. కామధేనువులాంటి పాడి ఆవు వట్టిపోయింది. జొన్నకంకుల్లా వెన్నులేసి, పెరట్లో నిలువెత్తునా గుబురుగా వృక్షంలా పెరిగిన తులసి నిలువునా ఎండిపోయింది. అన్నిటికీ కోడలే కారణం అని తెలుసుకోలేని పిచ్చిది కాదు మల్లమాంబ. అడిగినవాళ్ళకు, అడగనివాళ్ళకు అందరికీ గంట కొట్టినట్లు అదేమాట చెప్పింది. అంతటితో వూరుకోలేదు. తన అత్త నాగాంబ తనను పెట్టిన ఆరళ్ళను జాగ్రత్తగా కోడలికి చేరవేసింది. ఒక్కటీ పౌ పోనియ్యలేదు. అందునా ఆ కోడలు తన పసుపు కుంకుమలు తుడిచిపెట్టిన కన్నెర్ర మనిషాయే! అందునా ఆ 'బరువు సక్కదనం' చూస్తే కోడలి కడుపులో వున్నది ఆడపిల్లే అని తెలుస్తూనే వున్నది. తొలిచూలు ఆడపిల్ల వంశానికి అరిష్టం కాదూ? అందునా ఆ ఆలంపూరు సంతన అంతా ఆడ సంతనేనాయే!

మంత్రసాని మహా అనుభవజ్ఞురాలు. నెల తప్పి, పొద్దున్నే వికారంతో తల్లడం మల్లడం పడ్డం చూసి అప్పుడే చెప్పింది కడుపులో వున్నది ఆడపిల్లే అని. ఆ మాట విన్న దగ్గరినుండీ కంటికి కునుకు లేదు మల్లమాంబకు. అనుకున్నట్టే ఆ ఘడియలు దగ్గరపడ్డాయి. పొద్దుటినుంచీ నొప్పులు పడుతున్నది జోగులాంబ. ప్రాణాలు పోతయ్యేమో అన్నంత బాధలో కూడా పుట్టింటి యిలవేలుపును మెట్టినింటి యిలవేల్పును వేడుకుంటున్నది. ఆడపిల్ల అయితే పిల్లను, నన్ను కూడా బతకనియ్యదు, మగ పిల్లడు అయ్యేట్లు చూడమ్మా, చూడు స్వామీ అని!

పడమటింటి నుండి అరుపులు, మూలుగులు ఎక్కువ ఐనాయి. మంత్రసాని చేతికింది మనిషి పరుగునా వచ్చింది. పిండం అడ్డం తిరిగింది, ప్రసవం కష్టం అవుతున్నది అన్న వార్త అందించి లోపలికి వెళ్ళిపోయింది. అసలే మానసికంగా ఆందోళనలో వున్నాడు సుదర్శనాచార్యులు. శిశువు అడ్డం తిరిగింది అన్న మాట విని హతాశుడైనాడు.

అంతవరకూ మనసులో ధైర్యాన్ని కూడగట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. తల్లికి ఆమె ఆలోచనలు తప్పు అని చెబుదామని ప్రయత్నం చేయాలనీ వున్నది. ఆయువు తీరనిదే ఎవడూ పోడు కోడలు కారణంగానో యింకే కారణంగానో అని చెబుదామనుకున్నాడు తండ్రి పోయిన తర్వాత. ఆయువు తీరినవాడు మనవడికోసమో మరెవరికోసమో వుందామనుకున్నా వుండలేడు అని కూడా చెబుదామనుకున్నాడు. కానీ, తల్లిమాటకు ఎదురు చెప్పడం మహా పాపం కదా అని శంక!

అమ్మా! నీ తలి తండ్రులకు కూడా నువ్వే మొదటి సంతానానివి కదే, నీ తరువాత కదా ఒక మగశిశువు కలిగాడు అందామనుకున్నాడు. యిరుగు పొరుగు అమ్మలక్కల కూతుళ్ళను చూసి, నీకు యింట్లో ఒక ఆడ నలుసు లేకపోయింది, పండగలు పబ్బాలు సంబరాలు లేకుండాపోయింది అని ఎగబీలుస్తావు. నీ కోడలు నీ ఆడపిల్లే అనుకుంటే ఎంత ప్రశాంతంగా వుంటుందో ఆలోచించావే అందామనుకున్నాడు చాలాసార్లు. ధైర్యం చాలకనో, తల్లిని నిందించడం ఎంత పాపమో అనో, ఎందుకు ఆగిపోయాడో తనకే అర్థంకాలేదు.

ఊపిరి బిగబట్టి బరువుగా మూలుగుతున్న ధ్వని వినిపిస్తున్నది లోపలినుండి. క్రితం రోజు మధ్యాహ్నంనుండితను సేవించే సంతూరు నరసింహుడిని వేడుకుంటున్నాడు, ఈ రెండు రోజులూ ఆపు స్వామీ అని! చతుర్దశి అమావాశ్య రోజులు మరి! అందునా మంగళవారం! జ్యేష్ఠానక్షత్రం! భాద్రపదమాసం, ఈ రెండు రోజులూ గడిస్తే శరన్నవరాత్రులు ప్రారంభం.

భార్య పుట్టింట్లో అలంపురంలో జగజ్జనని జోగులాంబకు బ్రహ్మోత్సవాలు! బ్రహ్మాండమంతా ఒక్కదగ్గరికి చేరిందా అన్నట్టు మరాట్వాడ, త్రిలింగ, కన్నడ ప్రాంతాలనుండి లక్షలాది భక్తులు! నవరాత్రులలో నవబ్రహ్మల ఆలయాలనుండి కృష్ణా తుంగభద్రల సంగమందాకా నేల కనబడదు! పాలమూరునుండి పాలివాళ్ళను పిలిపించి వాళ్లకు సంతూరు నృసింహస్వామిని అప్పజెప్పి, నవరాత్రులు బ్రహ్మోత్సవాలు ముగిసేదాకా ఆలంపూరు అమ్మను తనివిదీరా సేవించుకోవడం మొదటినుండీ అలవాటు సుదర్శనచార్యులకు. ఈ సంవత్సరం కుదరకుండా పోతున్నది అన్న దిగులు ఒకటి మనసులో.

దానికితోడు మంచిరోజులు కావు అన్న బాధ. అందునా ఆడపిల్ల ఐతే తల్లి అన్నంత పనీ చేస్తుందేమో, పిల్లను ఏ నూతిలోనో గోతిలోనో విసిరేస్తుందేమో అని భయం.

రకరకాల ఆలోచనలతో ఆందోళనగా పచార్లు చేస్తునేవున్నాడు. మల్లమాంబ మంత్రబోధ కొనసాగుతూనే వున్నది. మరొక రెండు ఘడియలు దొర్లిపోయాయి. సంతూరు ఆయుర్వేదబ్రహ్మ సింగరాచార్యులవారు యేవో రెండు చూర్ణాలు, ఒక కషాయం యిచ్చి వెళ్లారు. అపరాహ్ణవేళ సమీపిస్తుండగా గుండెలు అవిసేలా భార్య కేక వినిపించింది. వెనువెంటనే భయంగా మంత్రసాని అరుపు వినిపించింది. సహాయకురాలు పరుగెత్తుతున్నట్లుగా వచ్చింది.

'మగపిల్లడు! ఎదురుకాళ్ళతో పేగులు మెళ్ళో వేసుకుని వున్నాడు..' అంటూ సన్నగా వణుకుతూ యింకా ఏదో చెప్పబోయింది. చివాలున లేచి, ఆమెను తోసుకుంటూ లోపలికి వెళ్ళింది మల్లమాంబ. తనూ ఆమె వెనుకే లోపలికి పరుగెత్తింది సహాయకురాలు. కొంతసేపటికి 'ఆగమైనంరా కొడుకా' అని బిగ్గరగా మల్లమాంబ గొంతు వినిపించింది.

పెద్దగా భార్య కేక వినబడగానే లెక్కలు వేసుకున్నాడు సుదర్శనాచార్యులు. జ్యేష్ఠ రెండవపాదం! శిశువు మేనమామకు, తోబుట్టువులకు కీడు! చతుర్దశి అమావాస్యల సంధి! మహాదోషం! తను చూడకూడదు! శోకాలు పెడుతూ గుండెలు బాదుకుంటూ మల్లమాంబ పరుగెత్తుకుంటూ వచ్చింది. ' పేగులు మెళ్ళో వేసుకున్నాడురా అయ్యా! మెడ అంతా ఒరుసుకుని నెత్తురు చిమ్ముతున్నదిరా అయ్యా!' అంటూ ఒక్కసారిగా పెద్దగా శోకాలు మొదలెట్టింది. గుండెలు బాదుకంటూ ' పుట్టు గుడ్డిరా అయ్యా! కనుగుడ్లు పొరలు కమ్ముకున్నాయ్ నాయనా! నష్టజాతకుడురా బిడ్డా!' అంటూ కుప్పకూలి పెద్దపెట్టున ఏడవడం మొదలుబెట్టింది.

నాగమాంబ అరుపులకు, ఏడుపులకు యిరుగమ్మా పొరుగమ్మ పోగయ్యారు. నాగమాంబను వంతులుగా ఓదార్చడం మొదలుబెట్టారు. ప్రహరీ గోడవద్ద చుట్టుప్రక్కల మగవాళ్ళు పోగయ్యారు. లోపలినుండి మంత్రసాని వచ్చింది. భార్య ఎలా వున్నదీ ఆత్రుతగా అడిగాడు సుదర్శనాచార్యులు. క్షేమంగానే మగతలో వున్నది అని తెలుసుకున్నాడు. శిశువు సంగతి చెప్పింది మంత్రసాని. నాగమాంబ చెప్పినట్టే చెప్పింది. రెండుకళ్ళూ కనుగుడ్లుకూడా కనిపించకుండా తెల్లటి పొరలున్నాయని చెప్పింది. పుట్టు గుడ్డి అని, యిక అంతే అని తేల్చింది.

కుతూహలం తీరి, ఓదార్చడానికి మాటలు మిగలక ఆడంగులు అందరూ వెళ్ళిపోయారు. కొంతసేపు లోగొంతుకలతో మాట్లాడుకుని తచ్చాడి మగవాళ్ళూ వెళ్ళిపోయారు. మబ్బులు కమ్ముకుని చల్లని గాలి వీచడం మొదలైంది. వర్షం చుట్టూ కమ్ముకుని వస్తున్న సూచనగా మట్టి తడిసిన వాసన తెలుస్తున్నది. మంత్రసాని సైగతో నెమ్మదిగా లేచి ఆమె వెనుకే లోపలికి వెళ్ళింది నాగమాంబ. కొంతసేపటికి దగ్గరికి వేసిన తలుపులమధ్యనుండి కొడుకును పిలిచింది లోగొంతుకతో. నిద్రలో నడుస్తున్నట్లుగా లోపలకు వెళ్ళాడు సుదర్శనాచార్యులు. సన్నగా జల్లులా మొదలై జోరు అందుకున్నది వర్షం.

పెరటి తలుపులను తెరిచి వెనుక గుమ్మం దగ్గర ఎదురుచూస్తూ నిలుచున్నది మంత్రసాని. పురిటిగది మొత్తల్లో నిలుచుని భార్యనే జాలిగా చూస్తున్నాడు సుదర్శనాచార్యులు. యింకా చెమటల చెమ్మ కూడా ఆరనేలేదు. అలిసి నోరు తెరుచుకుని మగతలో వున్నది. ఆ యాతనకు ఫలమైన శిశువును ఏ మాత్రమూ కనబడకుండా మందంగా గుడ్డలో చుట్టి తెచ్చింది మంత్రసాని సహాయకురాలు. తండ్రి చేతిలో పెట్టింది. నిర్వికారంగా అందుకున్నాడు. పెరటివైపు నడిచాడు.

పెరటి ప్రహరీ ద్వారం వద్ద చెట్టుకింద సగం తడుస్తూ ఎదురుచూస్తున్నది మంత్రసాని. తలుపులు తెరిచింది. వూరి బయటకు నడిచాడు సుదర్శనాచార్యులు. చేతికందే దూరంలోనివి కూడా కనిపించకుండా దట్టంగా కురుస్తున్నది వర్షం. దారి చూసుకోవడమే గగనమై పోతున్నది. ఏ క్షణంలోనైనా కాలు జారి పడేలా పూర్తిగా బురదమయంగా వున్నది. గుడివెనుకనుండి నడిచి వూరుబయటకు చేరుకున్నాడు. పాడుబడిన వూరిబావిని సమీపించాడు. రెండుచేతులూ సాచాడు. ఒక్కసారి చూడాలి అనే కోరికను అదిమిపెట్టుకుంటూ కనులు గట్టిగా మూసుకున్నాడు. చేతిలోని శిశువును బలంగా పాడుబడ్డ బావిలోకి విసిరేశాడు. చివ్వున వెనుదిరిగి దట్టమైన వర్షపు తెరలమాటున కనుమరుగైనాడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS